క్లుప్తంగా

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ ఈదా అనిలకుమారి

నరసాపురం రూరల్: సేంద్రియ వ్యవసాయంపై రైతులు అవగాహనతో ఉండాలని రైతాంగం పూర్తిగా రసాయన ఎరువుల మీద ఆధారపడకుండా జీవన ఎరువులు వాడితే సాగు ఖర్చు తగ్గించుకోవచ్చని నరసాపురం ఏడీఏ ఈదా అనిలకుమారి అన్నారు. గురువారం మండలంలోని నవరసపురం గ్రామంలో సర్పంచ్ ఈదా జగజ్జీవనరావు అధ్యక్షతన ఉండి కేవీకే శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరావు, ఏఈఓ ఇబ్బా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రం అందజేత



చినసంజీవనమ్మకు నియామక పత్రం ఇస్తున్న దృశ్యం

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో పబ్లిక్ హెల్త్ విభాగంలో ఓ మహిళను క్లాస్-4 వర్కర్‌గా నియమిస్తూ గురువారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య నియామక పత్రం అందించారు. 2022 డిసెంబర్ 17న యాదగిరి సంజీవనమ్మ శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తూ మృతిచెందింది. ఆమె కుమార్తె మానికల చిన సంజీవమ్మకు కారుణ్య నియామకం కల్పించారు. సక్రమంగా విధులు నిర్వహించాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి.త్రినాథరావు, సీపీఎం నేత కవురు పెద్దిరాజు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

నరసాపురం: నరసాపురం ఆర్టీసీ డిపో పరిధిలోని నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, పాలకొల్లు, మార్టేరు, పెనుగొండ చుట్టు పక్కల ప్రాంతాల ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రయాణికులు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ 99592 25486 నంబర్‌కు ఫోన్ చేసి కార్గోసేవలు, ఇతర సమస్యలపై ఫిర్యాదులు తెలపవచ్చని స్పష్టం చేశారు

సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవాలి



మొగల్తూరులో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఈఈ ఓంకారం

నరసాపురం రూరల్: ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎలక్ట్రికల్ ఈఈ ఓంకారం సూచించారు. గురువారం మొగల్తూరులో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాయితీతో మీ ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకునే సదుపాయం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందని దీని ద్వారా అతి తక్కువగా విద్యుత్ బిల్లు వస్తుందన్నారు. ఈ పథకాన్ని వినియోగించుకునే వినియోగదారులకు తక్కువ వడ్డీకే బ్యాంకులు రుణాలు అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ మధుకుమార్, ఏఈ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి



భీమవరంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలను పార్లమెంట్‌లో చర్చించి పరిష్కారానికి కృషి చేయాలని ఎల్ఐసీ ఏజెంట్స్ యూనియన్ అధ్యక్షుడు మైగాపుల నాగభూషణంనాయుడు కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను కోరారు. గురువారం భీమవరంలో బీజేపీ జిల్లా కార్యాలయంలో శ్రీనివాసవర్మను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగభూషణంనాయుడు మాట్లాడుతూ ఎల్ఐసీ ఏజెంట్స్ కమీషన్ తగ్గించడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నామని అలాగే ప్రీమియంపై జీఎస్టీ లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. పీఆర్‌కే రాజు, టీఎల్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్లు నిరుపయోగం



మార్టేరులో కొత్త బస్‌షెల్టర్‌లో బెంచీలను ఏర్పాటు చేయకపోవడంతో బస్సు కోసం నిల్చొని చూస్తున్న ప్రయాణికులు



మార్టేరులో అత్తిలి రోడ్డులో బస్‌షెల్టర్ ఎదురుగా దుకాణదారుల వాహనాలను పార్కింగ్ చేసిన దృశ్యం



మార్టేరు సెంటర్‌లో రోడ్డు మధ్యలోనే నిలిపిన ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

దాతలు నిర్మించినా నిర్వహణను పట్టించుకోని వైనం

పెనుమంత్ర: పెనుమంత్ర మండలంలో వివిధ గ్రామాలలో దాతలు సహకారంతో నిర్మించిన బస్ షెల్టర్‌లు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఈ బస్‌షెల్టర్ల నిర్వహణను స్థానిక గ్రామ పంచాయతీలు, ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణలకు గురవుతున్నాయి. ఆక్రమణల కారణంగా బస్సు కోసం ప్రయాణికులు రోడ్లపై పడిగాపులు పడాల్సి వస్తుంది. ప్రధానంగా ఈ ఇబ్బంది మండలంలో ప్రధాన సెంటర్‌లుగా ఉన్న బ్రాహ్మణచెరువు, మార్టేరు గ్రామాల్లో అధికంగా ఉంది. ఈ సెంటర్‌ల నుంచి హైదరాబాద్ , వైజాగ్ ప్రధాన నగరాలతో పాటు రాజమండ్రి, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం ప్రాంతాలకు నిత్యం ఎంతో మంది ప్రయాణికులు ప్రయాణిస్తూ ఉంటారు.

నిర్మాణాలు ఇలా

మార్టేరు సెంటర్‌లో గ్రామ పంచాయతీతోపాటు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కృషితో 4 బస్ షెల్టర్‌లు నిర్మించారు. బ్రాహ్మణచెరువు సెంటర్‌లో మార్టేరు రోడ్డులో వెలగలవారిపాలెం మాజీ సర్పంచ్ కర్రి వీర్రెడ్డి స్మారకార్థం ఆయన కుటుంబ సభ్యులు బస్ షెల్టర్లను నిర్మించారు. అత్తిలి రోడ్డులో మాజీ సర్పంచ్‌లు దాట్ల త్రిమూర్తిరాజు, రంగావతి దంపతుల దాతృత్వంతో బస్‌షెల్టర్‌లు నిర్మించినప్పటికీ అక్కడ మహిళలకు మరుగుదొడ్లు లేకపోవడంతో పరిసరాల పరిశుభ్రత కొరవడడంతో స్థానిక ఆటో డ్రైవర్లు, దుకాణదారులు రోడ్లపై ఆక్రమణలు చేయడంతో ప్రయాణికులు బస్‌షెల్టర్‌లలో కూర్చోవడానికి వీలులేక రోడ్ల పైనే నిలబడి బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తుంది. బస్‌స్టేషన్‌లు ఎదురుగా ఉన్న స్థలాన్ని ఆక్రమించడంతో బస్సులను డ్రైవర్లు రోడ్ల మధ్యలోనే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య అధికమవుతుంది. ఇప్పటికైనా స్థానిక పోలీస్, పంచాయతీ, ఆర్టీసీ అధికారులు స్పందించి బస్ షెల్టర్ల పరిస్థితిని మెరుగుపర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రేపటి నుంచి ఉచిత ఆక్యూప్రెజర్ చికిత్స శిబిరం

పెనుమంత్ర: మండలంలోని మార్టేరులో ఖండవల్లి కిశోర్ చారిటబుల్ ట్రస్టు భవనంలో శనివారం నుంచి 30 వరకు మానవతా సేవా సంస్థ, ఖండవల్లి చారిటబుల్‌సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత అక్యూప్రెజర్ చికిత్స శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఉప సర్పంచ్, మానవత సభ్యుడు కర్రి వేణుబాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆరు రోజుల చికిత్సకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 200 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆరు రోజుల పాటు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి చికిత్స ఉంటుందని ఒక్కో పేషెంట్‌కు ప్రతి రోజూ 20 నుండి 30 నిమిషాలు చికిత్స ఉంటుందని వివరించారు. ఈ చికిత్సను డాక్టర్ రామ్ మనోహర్-లోహియా ఆరోగ్య జీవన్ సంస్థాన్ రాజస్థాన్ థెరపిస్టు ద్వారా అందజేస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు మానవత జిల్లా కన్వీనర్ కొత్త సత్యనారాయణమూర్తి 94922 40529, ఖండవల్లి కిశోర్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు సత్తి సుబ్బన్నరెడ్డి 99592 25486కు ఫోన్ చేయాలని కోరారు.

వృత్తి విద్యా కోర్సులపై శిక్షణ

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వృత్తి విద్య నైపుణ్యాన్ని సాధించేందుకు కంప్యూటర్ డేటా ఎంట్రీ, టైలరింగ్‌లపై శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల సీడీడీసీ కార్యదర్శి డాక్టర్ పీబీ.ప్రతాప్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు నెలల వ్యవధిలో శిక్షణ ఇచ్చే కంప్యూటర్ ఆపరేటర్ కోర్సుకు టెన్త్, టైలరింగ్‌కు కనీసం ఐదో తరగతి చదివి ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న వారు 86885 94244 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

పశువుల సంక్షేమం కోసం వైద్య శిబిరాలు



యలమంచిలి: పెనుమర్రులో గొర్రెలకు వైద్య పరీక్షలు చేస్తున్న పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి



పెనుగొండ: వడలిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

యలమంచిలి: శీతాకాలంలో మంచు ప్రభావం వల్ల మూగ జీవులన్నీ రోగాలపాలయ్యే అవకాశం ఉన్నందున వాటి సంక్షేమం కోసమే గ్రామాలలో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. పెనుమర్రు, యలమంచిలిలంక గ్రామాల్లో గురువారం నిర్వహించిన పశు వైద్య శిబిరాల్లో ఆయన సిబ్బందితో కలసి 80 పశువులకు, 103 గొర్రెలు, మేకలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులంతా తమ పశువులను శిబిరాలకు తీసుకువచ్చి వైద్య సహాయం పొందాలని కోరారు. ఈ శిబిరాలను సర్పంచ్‌లు కవురు గోపి, వల్లభు సాయి వెంకట నరసింహారావు, ఎంపీటీసీ సభ్యురాలు కవురు నాగమణి సంయుక్తంగా ప్రారంభించారు. ఏనుగువానిలంక, బాడవ గ్రామాలలో శుక్రవారం పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. ఈ శిబిరాల నిర్వహణకు పశు సంవర్ధక సహాయకులు సతీష్, షబీర, జుజిత, తరుణ్, దుర్గా భవాని, దొరబాబు, వెంకన్నబాబు, వలవల బాలాజీ, హేమలత సహకరించారు.

పాలదిగుబడి పెంచడమే లక్ష్యం

పెనుగొండ: పాల దిగుబడి పెంచడమే లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ప్రమీలారాణి అన్నారు. గురువారం వడలిలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మి, డాక్టర్ కె.భాను తేజ తదితరులుప పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



రామన్నపాలెంలో ఏర్పాటు చేసిన శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న డీడీ హుస్సేన్

నరసాపురం రూరల్: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జె.హుస్సేన్ కోరారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా మండలంలోని రామన్నపాలెం గ్రామంలో పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ ఏలిషాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం, రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 97 పశువులను, 35 లేగ దూడలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ డాక్టర్ వై.సుధాకర్, డాక్టర్లు నీలిమ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఫెర్రీ ప్రారంభ పాట ధర రూ.3.13 కోట్లు



జేఏసీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: నరసాపురం మండలపరిషత్ ఆధీనంలోని మాధవాయిపాలెం ఫెర్రీకి 2025-2026 ఆర్థిక సంవత్సరానికి గానూ వేలం నిర్వహించేందుకు ప్రారంభ పాటధరను రూ.3.13 కోట్లుగా నిర్ణయిస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయం తీసుకుంది. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జేఏసీ సమావేశం జరిగింది. నరసాపురం- సఖినేటిపల్లి ఎంపీపీలో మైలాబత్తుల సోని, మల్లిఖార్జునరావు, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ ఇతర సభ్యులు కలిసి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. జేఏసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని జిల్లా ఉన్నతాధికారులు ఖరారు చేయాల్సి ఉంది. అనంతరం రేవు పాటను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణంరాజు తెలిపారు. ఈ సమావేశంలో మండలపరిషత్ పర్యవేక్షకులు ఎన్వీ భద్రరావు, ఈఓపీఆర్‌డీ కె.నాగేంద్రకుమార్, ప్రస్తుత, గత పాటదారులు భూపతి నాయుడు, అధికారి సతీష్, చక్రావధానుల చిన రెడ్డప్ప ధవేజీ తదితరులు పాల్గొన్నారు.

పెరుగులంక భూములు పేదలకు పంచాలి



సిద్ధాంతం మధ్యస్థ లంకలో పర్యటిస్తున్న సీపీఎం బృందం

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం మధ్యస్థ లంకలో గోదావరి వెంబడి పెరిగిన సుమారు 200 ఎకరాలను పేదలకు పంచాలని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. గురువారం లంక భూముల్లో పర్యటించారు. గత 30 సంవత్సరాలుగా లంక భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేస్తున్నా ప్రవభుత్వ ం పట్టించుకోవడం లేదని విమర్శించారు. సిద్ధాంతంలో వందలాది మంది నిరుపేద కుటుంబాలు కాయకష్టం చేసుకుంటూ జీవిస్తున్నారని, వారికి సెంటు భూమి లేని దుస్థితి ఉందన్నారు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా పల్లెపాలెం గ్రామానికి చెందిన కొందరు రైతులు సుమారు 50 ఎకరాలు ఆక్రమించుకుని సాగు చేస్తున్నారన్నారు. ఇప్పటికే సుమారు 400 ఎకరాలు పట్టా సాగుదారులు ఉంటున్న భూములు వెంబడి 200 ఎకరాలను పేదలకు పంచడం ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి షేక్ పాదుషా, మండల కమిటీ సభ్యులు కప్పల రత్నరాజు, ఆవుల శ్రీనివాసరావు, గుమ్మడి భాను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేతిరాత పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు అర్బన్: యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో గవర్నర్ పర్యటనలో భాగంగా నేషనల్ హ్యాండ్ రైటింగ్ డే సందర్భంగా గురువారం స్థానిక దీప్తి స్కూల్‌లో విద్యార్థులకు చేతిరాత పోటీలు నిర్వహించారు. చేతి రాత ఎంత అందంగా ఉంటే విద్యార్థుల భవిష్యత్ అంత గొప్పగా ఉంటుందని ఇంటర్నేషనల్ డైరెక్టర్ డా. ముచ్చర్ల సంజయ్ అన్నారు. విజేతలకు గవర్నర్ పెనుమాక రామమోహన్‌రావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కంపూడి మదన్, వేరుకొండ దుర్గాప్రసాద్, కానూరి ప్రభాకర్, రావూరి అప్పారావు, గాదె ఆంజనేయులు, పస్యావుల రవి, మంగిన సాయి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలను పాటించాలి

భీమవరం: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా భీమవరం ట్రాఫిక్ పోలీస్, విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని మునిసిపల్ హైస్కూల్లో గురువారం విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నారాయణమూర్తి మాట్లాడుతూ బాలలు వాహనాలను డ్రైవింగ్ చేస్తూ ప్రమాదం జరిగితే వారితో పాటు వారిని ప్రోత్సహించిన కుటుంబసభ్యులు కూడా శిక్షార్హులు అవుతారన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో లైసెన్స్‌తో పాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని చెప్పారు. విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్, హెచ్‌ఎం పి.శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్సై గగారిన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా ఏడీ కార్యాలయం వద్ద చేనేత కార్మికుల ధర్నా

పాలకొల్లు అర్బన్: చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలని, అలాగే మగ్గం ఉన్న ప్రతి నేతన్నకూ ఈ పథకాన్ని వర్తింపజేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బళ్ల చిన్న వీరభద్రరావు, కేతా గోపాలం, బూడిద జోగేశ్వరరావు, వాసా రామలింగం గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నేత కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని జిల్లా హ్యాండ్లూమ్ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

తూడు తొలగింపు పనుల పరిశీలన

కాళ్ల: సుమారు 10 గ్రామాలకు సాగు త్రాగునీరు అందించే బొండాడ పంట కాలువలో తూడు, చెత్త తొలగింపు పనులను చేపట్టినట్లు ఉండి వాటర్ డీసీ చైర్మన్ తోట ఫణిబాబు తెలిపారు. కూలీలతో చేపట్టిన తూడు, చెత్త తొలగింపు పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈయన వెంట మందపాటి కృష్ణమూర్తి, ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి



పాలకొల్లు అర్బన్: సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



నరసాపురం: సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ నాయకత్వ లక్షణాలు, ధైర్య సాహసాలు ప్రతీ ఒక్కరికీ ఆదర్శమని, స్వాతంత్ర్యం సాధించడానికి ఆయన చేసిన పోరాటాలు యావత్ దేశ ప్రజలకు చిరస్మరణీయమని పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో నేతాజీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ చేసిన త్యాగాలను నేటితరం గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ కవి డా.కోలాటి చినపెద్దిరాజు అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం లజపతిరాయపేటలోని గాంధీజీ, పొట్టిశ్రీరాములు, నేతాజీ విగ్రహాల వద్ద నేతాజీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. నేతాజీ విగ్రహానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. నేతాజీ విగ్రహాన్ని బహూకరించిన శిల్పకారుడు ఉదయ్‌కుమార్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు ఎం.కృష్ణప్రసాద్, బొక్కా నరసింహమూర్తి, కలిదిండి కృష్ణవర్మ, వై నరసింహరావు, ఫణికుమార్, సాయి బాబా గుప్త, కంచర్ల కృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నేత సుభాష్ చంద్రబోస్

నరసాపురం: స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ ఆదర్శనేత అని బీజీబీఎస్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మధుశాలినీ అన్నారు. సుభాస్‌చంద్రబోస్ జయంతిని గురువారం కళాశాల ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సి.నీరజ, జి.సాగర్, జి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు అర్బన్: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో సాంకేతిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.మధుకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు పూలపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పూలపల్లి, పందిగుంట, హౌసింగ్‌బోర్డు కాలనీలకు సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

యలమంచిలిలో..

యలమంచిలి: ఇలపకుర్రు 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల ఆకుల తొలగింపు కారణంగా ఈ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తామని నరసాపురం డివిజన్ ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.మధుకుమార్ గురువారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అక్షరాస్యత పెంపొందించుకోవాలి



వడలిలో ఎస్‌హెచ్‌జీ సభ్యులకు అందించిన పుస్తకాలు

పెనుగొండ: అక్షరాస్యత పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వడలి సీసీ రత్నమణి అన్నారు. వడలిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అక్షరాస్యత పెంపొందించడానికి ఏర్పాటు చేసిన ఉల్లాస్ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. 18 నుంచి 60 ఏళ్ల లోపు అందరూ చదవడం రాయడం నేర్చుకోవాలన్నారు. దీని వల్ల అక్షరాస్యత పెరగడంతో పాటు, ఆర్థిక అక్షరాస్యత పెరుగుతుందన్నారు. అనంతరం సభ్యులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప్పలపాటి చంటి, సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పరిశీలన



వడలిలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

పెనుగొండ: వడలి ఇందిరమ్మ కాలనీలో రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును అధికారులు పరిశీలించారు. గురువారం పెనుగొండ పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఇంజనీర్ నవీన్‌తో కలిసి అధికారులు పరిశీలించారు. రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. నిర్మాణం లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయం ఇంజినీర్ వి.మౌనిక, ఉప్పలపాటి చంటి, బొర్రా నాగేశ్వరరావు, అంగర వరప్రసాద్, వలపన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపాలి



పెనుగొండలో స్మార్ట్ మీటర్లు వద్దంటూ ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం సత్వరం నిలిపేయాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. గురువారం పెనుగొండలో సీపీఎం నాయకులు ఆందోళన నిర్వహించారు. సెల్‌కి 100 రెట్లు రేడియేషన్ విడుదల చేసే స్మార్ట్ మీటర్లు వల్ల అనారోగ్యంతో పాటు అధిక బిల్లులు వస్తాయన్నారు. స్మార్ట్ మీటర్లతో రూ.13 వేలు నుంచి రూ.15 వేల వరకూ వసూలు చేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. స్మార్ట్ మీర్లు బిగింపును ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కేతా గోపాలన్, ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.